ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులకు డిఆర్‌ఒ వి.శ్రీనివాసరావు ఆదేశం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 24వ తేదీ నుండి జరిగే ఇంటర్ సప్లిమెంటరీ, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రకడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో మంగళవారం ఆయన ఈ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 1 వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు, అలాగే ఈనెల 24 నుండి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం 28,668 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 6,545 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ ఇంటర్ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సీనియర్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,702 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వీరికి 35 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 35 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను, నలుగురు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించటంతోపాటు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు కూడా పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా విద్యార్థులకు ఆయా రూట్లలో ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తపాలా కార్యాలయం ద్వారా జవాబు పత్రాలను స్పీడ్ పోస్ట్‌లో పంపేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈసమావేశంలో డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సిఎస్ఎస్ఎన్ రెడ్డి, డిఇఒ యు.వి.సుబ్బారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎన్.కుమార్, డిఇసి సభ్యులు శ్రీరామ్ మూర్తి, వెంకట్రావు, ఆర్యపత్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో

ఎన్ఆర్ఐ అభ్యర్థుల హవా

టిడిపి గుడివాడ, గన్నవరం అభ్యర్థులదే అధిక వ్యయం
అత్యల్పంగా వైసిపి బందరు ఎంపి అభ్యర్థి వ్యయం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు సైతం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించుకున్నారు. ప్రధాన మీడియాలో ప్రకటనలతోపాటు ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల్లో ఎక్కువగా పోస్టులు పెట్టారు. వీటిని వినియోగించుకోవడంలో టిడిపి అభ్యర్థులే కృతకృత్యులయ్యారు. వైసిపి అభ్యర్థులకన్నా టిడిపి అభ్యర్థులు ఎక్కువగా వ్యయం చేశారు. టిడిపి గుడివాడ, గన్నవరం అసెంబ్లీ అభ్యర్థులైన ఎన్ఆర్ఐలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు సోషల్ మీడియా ప్రచారానికి ఎక్కువ వ్యయం చేశారు. అతి స్వల్పంగా వైసిపి మచిలీపట్నం ఎంపి అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ ఖర్చు చేశారు.


మీడియా ధృవీకరణ, పర్యవేక్షణ కమిటీ సూచనలకు అనుగుణంగా సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార వ్యయాన్ని జిల్లా సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్స్ కమిటీ పరిశీలిస్తోంది. ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, ఫేస్‌బుక్‌ల్లో అభ్యర్థులు పెట్టిన పోస్టులు, వీడియోలు, పోస్టర్లను పరిశీలిస్తోంది. ఈ కమిటీ అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాలను మినహాయించి వాటి నుంచి షేర్ అయిన పోస్టులు, వీడియోలు, పోస్టర్ల వీవర్‌షిప్‌ను పరిగణలోకి తీసుకుని వ్యయాన్ని అంచనా వేస్తోంది. ఇతర ఖాతాల నుంచి జరిగిన ప్రచారానికిగానూ ఒక్కో వీవర్‌షిప్‌కు రూ.0.30 వ్యయంగా పరిగణలోకి తీసుకుంటుంది. దీన్ని అభ్యర్థి వ్యయంగా పరిగణలోకి తీసుకుంటుంది. ఇప్పటికే జిల్లాలో కొందరు అభ్యర్థుల సోషల్ మీడియా పోస్టులను పరిశీలించి వ్యయంపై కమిటీ నివేదికలు సిద్ధం చేసింది. వెనిగండ్ల రాము వ్యయం రూ.8.90 లక్షలు

(మిగతా 2లో)





టిడిపి గుడివాడ ఎన్ఆర్ఐ అభ్యర్థి వెనిగండ్ల రాము



టిడిపి గన్నవరం ఎన్ఆర్ఐ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రామకృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దష్టి సారించామని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ తెలిపారు. జిల్లాలో విస్తతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టామన్నారు. ఎన్నికల నేపధ్యంలో అల్లర్లకు పాల్పడే వారిపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాల విడుదల క్రమంలో రాజకీయ ప్రేరేపిత హింసాత్మక ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు సష్టించిన లేదా ప్రేరేపించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యం ఫుట్ పెట్రోలింగ్‌లు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయా డివిజన్ల ఎసిపిల నేతృత్వాల అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని 35 ప్రదేశాల్లో ఇన్‌స్పెక్టర్లు, వారి సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమయంలో 60 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 61 మంది అనుమానితులు అదుపులోనికి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు

(మిగతా 2లో)



కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కోరిన ప్రతి కార్మికుడికీ ఉపాధి పనులు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



ప్రజాశక్తి - విజయవాడ : ఉపాధి హామీ చట్టం కింద పని కోరిన ప్రతి కార్మికుడికీ ఉపాధి కల్పిస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డికి వివరించారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, విద్యుత్ తాగునీటి సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్‌తో ఉపాధి హామీ పనులను భాగస్వామ్యం చేసి పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి దష్ట్యా జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపి వేసవి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా శివారు గ్రామ ఆవాసాలలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. వేసవిని దష్టిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద చేపట్టిన నీటి సంరక్షణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామని, సాంకేతిక సమస్య ఎదురైతే తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.



సిబిఎస్ఇపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సిబిఎస్ఇ శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 17, 18, 20, 21 తేదీల్లో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఉన్న సిబిఎస్ఇ పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఇంగ్లీషు, బయాలజీ, సోషల్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల ట్రెనింగ్ ప్రోగ్రాం ఎస్‌సిఇఆర్‌టి కె.వి.శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌టిఆర్ పాఠశాల విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరసా వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎన్‌టిఆర్ జిల్లా ఎఎంఒ ఎస్.అశోక్ బాబు, ఎల్‌ఎఫ్ఇ కోఆర్డినేటర్ ఎ.విజయకుమార్, ఎపిఆర్ఎస్ పులిగడ్డ ప్రిన్సిపల్ ఎస్‌టిపి కుమార్, సబ్జెక్ట్ డిఆర్‌పిలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 20 మందికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 20 మందికి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. మంగళవారం 6వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 20 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సంబంధిత రైల్వే కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.శర్మ ఒక వ్యక్తికి ఏడు రోజులపాటు, నలుగురికి ఒక్కొక్కరికి నాలుగు రోజులపాటు జైలు శిక్ష, మిగిలిన 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియాలో ఎన్ఆర్ఐ అభ్యర్థుల హవా

సోషల్ మీడియాను ప్రచారసాధనంగా ఉపయోగించుకోవడంలో టిడిపి గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము దరిదాపుల్లో మరే అభ్యర్థీ లేరు. ఇతరుల ఖాతాల నుంచి రాముకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, పోస్టింగ్‌లు, వీడియోలు షేర్ చేసినందుకు వీవరెష్‌వ్ ఆధారంగా రాము 8 లక్షల 90 వేల 170 రూపాయలు ఖర్చు చేసినట్లు లెక్క తేల్చారు. అలాగే టిడిపి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు రూ.1.20 లక్షలు, ఆ పార్టీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర రూ.47,196 వ్యయం చేశారు. ఇక్కడ మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వ్యయం రూ.27,826 లోపే ఉంది. ఇతర అభ్యర్థుల వ్యయంపై మదింపు జరుగుతోంది.

చంద్రశేఖర్ వ్యయం రూ.500 మాత్రమే!

జనసేన బందరు పార్లమెంట్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపి వల్లభనేని బాలశౌరి సోషల్ మీడియాకు రూ.7,916 వ్యయం చేశారని కమిటీ లెక్కించింది. వైసిపి బందరు ఎంపి అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ వ్యయం కేవలం రూ.586 మాత్రమే ఉంది. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉండి సోషల్ మీడియాలో చంద్రశేఖర్ అత్యల్పంగా ఖర్చు చేయడం చర్చనీయాంశమైంది.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

తెలిపారు. మొత్తం 600 షాపుల యజమానులకు, 2500 మంది సామాన్యులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున రూరల్ డిసిపి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నందిగామ ఎసిపి డాక్టర్ బి.రవికిరణ్, సిసిఎస్ ఎసిపి ప్రవంతి రాయ్ ఆధ్వర్యంలో నందిగామ డివిజన్ పరిధిలని నందిగామ డివిజన్ కాలనీలో, తిరువూరు ఎసిపి మురళీ మోహన్ ఆధ్వర్యంలో మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవుని చెరువు గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల గురించి సమగ్ర సమాచారం సేకరించడంతోపాటు ప్రస్తుతం వారి నడవడిక, కార్యకలాపాలపై విచారించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 867 ఇళ్లను, 7440 మందిని తనిఖీ చేసినట్లు తెలిపారు. 72 మంది అనుమానితులను ఐరిష్ ద్వారా చెక్ చేయగా పాత కేసులు ఉన్న ఆరుగురిని గుర్తించినట్లు తెలిపారు. 120 మోటారు బైకులను తనిఖీ చేసి 47 బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బొండా వ్యాఖ్యలు దొంగే దొంగ అన్నట్లున్నాయి

వైసిపి సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రజాశక్తి - విజయవాడ

దొంగే దొంగ దొంగ అన్నట్లుగా బొండా ఉమా మాట్లాడుతున్నారని వైసిపి విజయవాడ సెంట్రల్ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి నాయకుల వల్ల ఐపిఎస్ అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారని బొండా ఉమా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి నర్సరావుపేట ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు పల్నాడు ఎస్‌సి బిందు మాధవ్ బంధువు కాదా అని వెలంపల్లి ప్రశ్నించారు. బిజెపితో పొత్తు పెట్టుకుండే ఎన్నికల కమిషన్ ద్వారా తమకు కావాల్సిన అధికారులను నియమించుకోవడానికేనన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పల్నాడులో అంతకు ముందు ఉన్న ఎస్‌పిపై నిరాధరణ ఆరోపణలు చేసి తమకు కావాల్సిన బిందు మాధవ్ ఎస్‌పిగా వచ్చేలా చేశారన్నారు. బిందు మాధవ్ ఎస్‌పిగా వచ్చిన తర్వాతే పల్నాడులో ఘర్షణలు చోటుచేసుకున్న విషయాన్ని బొండా ఉమా తెలుసుకోవాన్నారు. అలాగే తిరుపతిలోనూ అనేకచోట్ల ఎన్నికల కమిషన్ ద్వారా తమకు కావాల్సిన అధికారులను నియమించుకుని ఘర్షణ సృష్టించింది టిడిపి నాయకులేనని వెలంపల్లి పేర్కొన్నారు. వారే ఘర్షణ సృష్టించి ఆరోపణలు మాత్రం వైసిపిపై చేయటం విడ్డూరమని పేర్కొన్నారు. బొండా ఉమా వాస్తవాలను వక్రీకరించినంత మాత్రాన అవి వాస్తవాలు కాకుండాపోవని తెలిపారు.

జంతు పరిరక్షణ చట్టం అమలుకు నోడల్ అధికారి నియామకం

ప్రజాశక్తి - విజయవాడ

బక్రీద్ సందర్భంగా జంతు పరిరక్షణ చట్టాల అమలు కోసం ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ నోడల్ అధికారిని నియమించారు. రాష్ట్రంలో బక్రీద్ సందర్భంగా జంతువుల అక్రమ రవాణా, వధ మొదలగు నేరాలను అరికట్టాలనే ఉద్దేశంతో జంతు పరిరక్షణ చట్టాలను అమలుపరిచే దిశగా హైకోర్ట్ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ జిల్లా పోలీసుల తరుపున ఒక ఎసిపి స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించారు. నగరంలో ఎక్కడైనా జంతువులపై జరుగుతున్న నేరాలు, హింసపై అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. పార్థసారథి (సెల్ 9440627073)కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి

హాజరైన కేంద్ర మాజీ మంత్రి పళ్లం రాజు

ప్రజాశక్తి - విజయవాడ

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఆయనకు నివాళులర్పించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ఎం.ఎం.పళ్ళంరాజు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, వి.గురునాథం, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ సైన్స్, సాంకేతికతను దేశానికి అందించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని మరచిపోలేమన్నారు. ఆయన అందించిన అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నామని వివరించారు.





విద్యార్థులతో పుస్తక పఠనం

ప్రజాశక్తి - విజయవాడ

గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయాధికారి కె.రమాదేవి వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా పుస్తకాలు చదవడంతోపాటు మనం చేసుకోవాలని, అప్పుడే పూర్తి పరిజ్ఞానం వస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి : భవానీపురం సిఐ

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధి కుమ్మరిపాలెం సెంటర్ నుండి సితార జంక్షన్ వరకు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు భవానీపురం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు, భవానీపురం సిఐ గా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్, మంగళవారం కుమ్మరిపాలెం సెంటర్ నుండి సితార జంక్షన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
3
బుధవారం 22 మే 2024

నాక్ బృందం సందర్శన

ప్రజాశక్తి-ఉయ్యూరు : నేషనల్ అస్సెసంట్ అండ్ అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏజీఅర్ఎస్ఎస్ కళాశాలను సందర్శించారు. కమిటీ పర్యటనలో భాగంగా సోమ, మంగళవారం రెండురోజుపాటు కళాశాలలో వివిధ విభాగాలు, ప్రయోగశాలలు, గ్రంధాలయం, వ్యాయామశాల, బొటా నికల్ గార్డెన్ పరిశీలించారు. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, తల్లితండ్రులతో మాట్లాడి కళాశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కమిటీకి చైర్మన్గా మధ్యప్రదేశ్లోని ఏపీఎస్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ షీతల్ కుమార్ ఛటోపాధ్యాయ, సభ్యునిగా ముంబై మండలిస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ గోపాల్ కల్ కోటి వ్యవహరించారు. కళా శాల ప్రిన్సిపాల్ వి శ్రీరామ్, ప్రత్యేక అధికారి కె సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి గిరిప్రసాద్ కళాశాల విశిష్టతను కమిటీకి వివరించారు.

ఐటిఐలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - గుడివాడ : ఈ విద్యా సంవత్సరానికిగాను ఐటిఐ కోర్స్లలో అడ్మిషన్స్ పొందుటకు కృష్ణాజిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐ.టి.ఐలలో సీట్ల భర్తీ చేయుటకు గాను ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కె.బి.ఆర్ ప్రభుత్వ ఐ.టి.ఐ కన్వీనర్ ఎల్.గౌరీమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు, 8వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐలలో చేరబోవు అభ్యర్థులు ఐటిఐ.ఏపి.జిఓవి.ఇన్ ద్వారా గాని ప్రభుత్వ ఐ.టి.ఐ ద్వారా గాని వచ్చే నెల జూన్ 10 తేది, సాయంత్రం 5 గం. లోపు తమ దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేసుకోగలరని ఆమె కోరారు. ఆన్లైన్లో వివరాలు పూర్తి చేసినపుడు తప్పులు దొర్లకుండా, దరఖాస్తు పూర్తి అయిన అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్తో దగ్గరలో గల ప్రభుత్వ ఐటిఐలో వెరిఫికేషన్ చేయించుకొని ప్రిన్సిపల్ ద్వారా అప్రూవల్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ కార్యాలయం కె.బి.ఆర్ ప్రభుత్వ ఐ.టి.ఐ., గుడివాడ నందు గానీ ఫోన్ నెం. 08674-295953, 85559 52320, 82975 74757, 99851 62555 సంప్రదించాలని కన్వీనర్ గౌరీమణి పేర్కొన్నారు.



చిరంజీవిని కలిసిన బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : సినీ నటుడు, మాజీ కేంద్రమంత్రి చిరంజీవిని అవనిగడ్డ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మంగళవారం హైదరాబాదులో కలిసినట్లు తెలిపారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బుద్ధ ప్రసాద్ పూలగుచ్చం ఇచ్చి శాలువాతో అభినందించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రాం, అల్లుడు శీలం అశ్విని, కుమారులు ఉన్నారు.

హింసాత్మక చర్యలను ప్రోత్సహించొద్దు : ఆర్‌డిఒ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ పద్మావతి

ప్రజాశక్తి-గుడివాడ : ఎన్నికల తర్వాత జరిగే హింసాత్మక చర్యలను నిరోధించాలని, హింసాత్మక చర్యలను ప్రోత్సహించవద్దని ఆర్‌డివో పి.పద్మావతి కోరారు. మంగళ వారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో గుడివాడ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించిన అభ్యర్థుల తరఫున పాల్గొన్న రిప్రజెంటేటివ్స్/ ఏజెంట్స్తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సెక్షన్ 144 సి.ఆర్.పి.సి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎవరూ కూడా బహిరంగ ప్రదేశాల్లో నలుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది గుమిగూడి ఉండరాదని, ఎటువంటి మారణాయుధాలు కలిగి ఉండరాదని సూచించారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం చేయకూడదని, యువత బైక్ సైలెన్సర్ లేకుండా సౌండ్స్తో ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని హెచ్చరించారు. ఒక పార్టీ అభ్యర్థులు వేరే పార్టీ అభ్యర్థులను రెచ్చగొట్టే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయకూడదన్నారు. సోషల్ మీడియాలో అనగా ట్విట్టర్, ఫేస్బుక్ మరియు వాట్సాప్‌లలో ఇతరులకు ఇబ్బంది కలిగి విధంగా అసభ్యకర పోస్టులు పెట్టడం గాని, ఎన్నికల సంబంధించి ఒక వర్గం వారిని రెచ్చగొట్టే విధంగాగాని, కించపరిచే విధంగా గాని పోస్టులు పెట్టడం చేయరాదన్నారు. పేర్కొన్న సూచనలను అధిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్.వో పద్మావతి హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ ఒనటౌన్, టూటౌన్, రూరల్ సి.ఐ., రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డిఎస్పి జయసూర్య

ప్రజాశక్తి-గన్నవరం : ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి పర్యవేక్షణలో గన్నవరం డిఎస్పి ఆర్.జి జయసూర్య నేతత్వంలో హనుమాన్ జంక్షన్ సీఐ నవీన్ నరసింహ మూర్తి, ఆత్కూరు ఎస్సై పైడి బాబు పర్యవేక్షణలో మంగళ వారం పెద్దవుటపల్లి గ్రామాన్ని సందర్శించి, విశిబిల్ పోలిసింగ్ నిర్వహించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. తర్వాత కవాతు నిర్వహించి, రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పురస్కరిం చుకుని ప్రజలు అందరూ సహకరించాలని చెప్పారు. సెక్షన్ 144 సి ఆర్పిసి, సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురు అంతకంటే ఎక్కువ మంది ఒకే చోట గుమిగూడి ఉండరాదని తెలిపారు. రాజకీయ ప్రలోభాలకు లోనై ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణిక ఆవేశానికి లోనై గొడవలు పడటం వల్ల వారిపై కేసులు నమోదు అయి తర్వాత, ఇబ్బందులు పడతారని తెలియచేసారు.

మాజీ ఎంపి కొనకళ్ళకు పరామర్శ



కొనకళ్లను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మోపిదేవి : గడచిన కొద్ది రోజుల క్రితం స్వల్ప అస్వస్థతకు గురై విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది, విశ్రాంతి తీసుకుంటున్న మాజీ పార్లమెంటు సభ్యులు, కొనకళ్ళ నారాయణరావును మచిలీపట్నంలోని వారి స్వగహంలో మంగళవారం మోపిదేవి మండల టిడిపి నాయకులు కలిసి పరామర్శించారు. మోపిదేవి మండలం టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్ధన రావు , తెలుగు యువత రాష్ట్ర నాయకులు రావి రత్నగిరి, టిడిపి బీసీ నాయకులు మురాల సుబ్బారావు, పడమట వెంకటేశ్వ రరావు ,రాజులపాటి ప్రసాద్, ఎస్సి సెల్ నాయకులు మోటుపల్లి జనార్ధనరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు తదితరులు కొనకళ్ళను పరామర్శించిన వారిలో ఉన్నారు.

పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఆ ఫలితాల అనంతరం ఘర్షణలు జరుగుతాయని నిఘా సంస్థలు హెచ్చరించడంతో అటువంటి ఘర్షణలో పాల్గొనే వ్యక్తులను పాత నేరస్తులను గుర్తించేందుకు పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవనిగడ్డలోని లంకమ్మ మాన్యంలో అవనిగడ్డ సీఐ త్రినాథ్, చల్లపల్లి సిఐ నాగప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కార్డన్ అండ్ చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకస్మికంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రౌడీ షీటర్లు సస్పెక్టెడ్ షెటర్ల నివాస గృహాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు సరిగా లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక ఎస్ఐలతో పాటు సిబ్బంది కూడా పాల్గొని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. **ప్రజాశక్తి - గుడివాడ** : రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని గుడివాడ పోలీసులు అలర్ట్ అయ్యారు. కౌంటింగ్ సమీపిస్తున్న వేళ పోలీసులు తీసుకుంటున్న ముందస్తు చర్యలలో భాగంగా పట్టణంలోని గుడ్‌మెన్ పేట, వాంబే కాలనీల్లో మంగళవారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సెర్చ్‌లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కౌంటింగ్ ముందు తర్వాత నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచనలు చేశారు.



అవనిగడ్డ మండలంలో..



గుడివాడ మండలంలో...

గోవుల అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక చెక్‌పోస్టులు : ఎస్‌పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : హైకోర్టు వారి ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవరైనా గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడినట్లయితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవధ, గోహత్యను చేయకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను భక్తిశ్రద్ధలతో కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.హైకోర్టు వారి ఆదేశాల మేరకు గోవుల అక్రమ రవాణా, గోవధ నివారణ చర్యలో భాగంగా కష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వరరావును జిల్లా నోడల్ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం గోవుల అక్రమ రవాణా నివారణ చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా స్పెషల్ టీం ను ఏర్పాటు చేసి కబేళాలు మరియు గోవధకు ఆస్కారం ఉన్న ఇతర ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా హైకోర్టు వారి ఉత్తర్వులను ఉల్లంఘించిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గోవుల అక్రమ రవాణా మరియు గోవధకు సంబంధించిన సమాచారం తెలిసిన యెడల వెంటనే డయల్-100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఐదుగురిపై రౌడీషీట్

ప్రజాశక్తి- ఉయ్యూరు : ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో చట్టాన్ని అతిక్రమించి గలాటా చేసిన ఐదుగురు వ్యక్తులపై రౌడీషీట్ తెరచినట్టు ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశు కుమార్ తెలిపారు. పోలింగ్ సమయంలో విధినిర్వహణలో ఉన్న అధికారులపై దౌర్జన్యంచేసి వి ధులకు ఆటంకపరచి ఎన్నికల నియమావళి, చట్టాన్ని ఉల్లంఘించిన వైసీపీ నాయకుడు, రాజులపాటి రామచంద్రరావు మరో నలుగురిపై చట్టపరంగా చర్యలు తీసుకుని వారిపై రౌడీషీట్లు తెరచి బైండోవర్ చేసినట్టు ఎస్సై తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజు

గొడవలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి పెదపారుపూడి : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పెదపారుపూడి మండలంలో సమస్యాత్మక గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్స్‌లను ఎస్ఐ రాజు సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు నియమావళిని ప్రజలందరూ తూచా తప్పకుండా పాటించాలని, ఎవరూ కూడా బహిరంగంగా గాని సోషల్ మీడియా ద్వారా గాని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదని ఎస్ఐ అన్నారు. బాణసంచా పేల్చడానికి ఎలాంటి అనుమతులు లేవని, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 144 అమలులో ఉన్నాయన్నారు. ఎలక్షన్ ఫలితాలు దష్ట్యా ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, కేసులలో ఇరుక్కోవద్దు అని యువతకు హితవు పలికారు. చట్టం దష్టిలో అందరూ సమానులే చట్టాన్ని అతిక్రమించినట్లయితే ఎంతటి వారిపై నైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఘంటసాల : మండల కేంద్రమైన ఘంటసాలలోని విద్యుత్తు సబ్ స్టేషన్లో మరమ్మత్తులు నిమిత్తం బుధవారం విద్యుత్తు సరఫరా నిలివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలోని ఘంటసాల, దేవరకోట, మల్లంపల్లి, చిలకలపూడి, వి. రుద్రవరం, ఘంటసాలపాలెం, కొత్తపల్లి గ్రామాలలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.కావునా విద్యుత్తు వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఏఈ రవి కుమార్ కోరారు.

బాల్యవివాహాల నిరోధానికి ప్రణాళిక

కొత్త రోడ్ మ్యాప్‌తో ఎన్‌జిఒలు, బృందాలు సిద్ధం
గ్రామాల్లో విస్తృత ప్రచారంతో అవగాహనలు



వి.ఎం.ఎం. ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 2030 నాటికి దేశంలో బాల్య వివాహాలను నిరోధించాలని ఐక్యత, దృఢ సంకల్పంతో దేశవ్యాప్తంగా ఉన్న 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' ప్రచారానికి చెందిన సుమారు 200 మంది ఎన్‌జిఒలు భాగస్వాములు రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. 25 సిఎంఎఫ్‌ఐ కీలక మిత్రపక్షమైన ఎన్‌టిఆర్ కృష్ణ జిల్లాలో పనిచేస్తున్న వాసవ్య మహిళా మండలి కూడా నాలుగు రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. వాసవ్య మహిళా మండలి కొత్త కార్యాచరణ, ఆలోచనలతో తిరిగి వచ్చి జిల్లాల్లో వాటిని అమలు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారు.

దేశవ్యాప్త ప్రచారం అయిన 'బాల్య వివాహ రహిత భారతదేశం' ప్రచారం 2022లో ప్రారంభమైంది రీచ్, ఇంపాక్ట్, పార్టనర్ నెట్‌వర్క్ ద్వారా ఈ ప్రచారం గణనీయంగా విస్తరించింది. గత ఏడాది 17 రాష్ట్రాల్లోని దాదాపు 300 జిల్లాల్లో 161 మంది ఎన్జీవో భాగస్వాములు పని చేయగా, ఇప్పుడు ఈ ప్రచారం 22 రాష్ట్రాలకు చేరుతోంది. ఈ ప్రచారం బాల్య వివాహాలపై దృష్టి సారించడంతో పాటు పిల్లల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కూడా పని చేస్తోంది. వీటిలో చాలా జిల్లాలు బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాలుగా కూడా గుర్తించబడ్డాయి.

సామూహిక బృందాలుగా కృషి

బాల్య వివాహ రహిత భారతదేశం ప్రచారం బాల్య వివా హాలకు వ్యతి రేకంగా పోరాటంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతు ఇస్తుంది. ఈ మెరుగైన రోడ్‌మ్యాప్ యొక్క ఆవశ్యకతను బాల్య వివాహ రహిత భారత ప్రచార కన్వీనర్ రవికాంత్ మాట్లాడుతూ 'బాల్య వివాహాల వంటి లోతుగా పాతుకుపోయిన సామాజిక సమస్య కోసం సామూహిక బృందం కృషి చేస్తోందన్నారు. గ్రామ పెద్దలు, ప్రభుత్వాలు, చట్ట అమలు సంస్థలు బాల్య వివాహాలకు ముగింపు పలకడానికి వారి నిబద్ధతను ప్రతిబింబించే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయిని అన్నారు. బాల్య వివాహాలు శతాబ్దాలుగా కొనసాగుతున్నాయి, కానీ ఇప్పుడు దానికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

బాలల రక్షణ కోసం పని చేయడం గర్వకారణం

వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు బి.కీర్తి

జాతీయ వర్క్‌షాప్ గురించి వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు డా.బి.కీర్తి మాట్లాడుతూ "మా లాంటి అనేక బాలల సంరక్షణ సంస్థలు ఉమ్మడి లక్ష్యం కోసం పని చేయడం మాకు చాలా గర్వకారణం అని, బాల్య వివాహాలను అంతం చేయడం లక్ష్యం అయితే ఈ కొత్త రోడ్‌మ్యాప్‌తో మేము కొత్త నేర్చుకున్నాము' అని తాము ఇప్పుడు ఈ ఆలోచనలను అట్టడుగు స్థాయిలో అమలు చేయగలమని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తమ పోరాటంలో గణనీయమైన పురోగతిని సాధించగలమని చెప్పారు. పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, స్థానిక గ్రామ పెద్దలతో కలిసి పని చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. 'మా జిల్లాలోని ప్రతి గ్రామం బాల్య వివాహ రహితంగా ఉండేలా అధికారులు, గ్రామ పెద్దలతో మరింత దృష్టి సారించి పని చేస్తూనే ఉంటాము. ఇవి వర్క్‌షాప్ నుండి వాటిని తక్షణమే అమలు చేయాలని మేము నిశ్చయించుకున్నాము. మేము 'వెన్ చిల్డ్రన్ హావ్ చిల్డ్రన్: టిప్పింగ్ పాయింట్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్' అనే పుస్తకంలో వివరించిన వ్యూహాన్ని ఇప్పటికే అమలు చేసాము, చేస్తున్నాము.గొప్ప విజయాన్ని నమోదు చేస్తున్నాము

2024-25 కోసం జాతీయ వర్క్‌షాప్‌లో రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఇది పిల్లల రక్షణ కోసం ఒక స్మారక చట్టపరమైన కార్యక్రమాన్ని సూచిస్తుంది. బాల్య వివాహాల కేసుల్లో చట్టపరమైన సమ్మతిని నిర్ధారించడానికి ఈ జిల్లాల్లో చట్టపరమైన చర్యలు, అవగాహన డ్రైవ్‌ల ద్వారా వాటిని నిరోధించడానికి ఎన్‌జిఒలు ముందుకు సాగుతున్నాయి. జిల్లా అధికారులు, బాల్య వివాహాల రక్షణ అధికారులతో కలిసి పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.



దుర్గగుడి అభివృద్ధి పనులను పరిశీలన చేస్తున్న టెక్నికల్ కమిటీ, ఇఓ రామారావు

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొండ కింద, పైన జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు మంగళవారం పరిశీలించారు. దుర్గగుడి కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు, టెక్నికల్ కమిటీ నిపుణులు ఆర్.కొండలరావు ఆధ్వర్యంలో టెక్నికల్ సభ్యులు - సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, విజయవాడ సివిల్ డిపార్ట్‌మెంట్ డీన్ పాండురంగారావు, రమేష్ కుమార్, పి.త్రిమూర్తి రాజు, శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ బృందంతో కలిసి జరుగుచున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ ఇఒ, ఇంజినీరింగ్ బృందం వారికి తగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజనీర్ రమాదేవి, డిఈఈలు, ఏఈఈలు , ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కెబిఎన్ ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు సామాజిక బాధ్యతలను పెంపొందించుకొని సమాజానికి అండగా ఉండాలని కాకరపర్తి భావనారాయణ కళాశా ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నగరానికి శివారు ప్రాంతంలో ఉన్న కార్నర్ స్టోన్ ఓల్డేజ్ హోమ్‌కు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవోల ఆధ్వర్యంలో విద్యార్థులు వృద్ధాశ్రమానికి వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. సమాజంలోని అట్టడుగువర్గాలకు అండగా ఉండే విధంగా విద్యార్థులు తమ భవితను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తోటి మానవులకు సేవచేసిన వారు భగవంతుడికి సేవ చేసినట్లేనని సూచించారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డి.వపన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, జెడ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సిఎం కావాలని ప్రార్థనలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గాలో కొండపల్లి వైఎస్ఆర్ సిపి నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరి ఆశీస్సులతో మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ప్రమాణం స్వీకారం చేసి ప్రజలందరికీ మంచి జరగాలని, మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి సామాన్యుడైన సర్నాల తిరుపతిరావు మంచి మెజార్టీతో విజయం సాధించాలని కాంక్షిస్తూ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొండపల్లి మున్సిపాలిటీ సచివాలయం కన్వీనర్లు షేక్ జానీ షరీఫ్, కాలగడ్డ మనోహర్ పాల్గొన్నారు.

మద్యం, గంజాయికి అడ్డాగా స్వర్గపురి, పద్మావతి ఘాట్


అసాంఘిక శక్తులకు నిలయంగా...
రోజు రోజుకు పెరిగిపోతున్న ఆకతాయిల ఆగడాలు...
రోడ్లపైనే వీరంగం వేస్తున్న మందుబాబులు...
గంజాయి మత్తులో దాడులకు తెగబడుతున్న వైనం...
చోద్యం చూస్తున్న పోలీసులు, ఇతర అధికారులు
భీతిల్లుతున్న కృష్ణలంక 22వ డివిజన్...
భ్రమరాంబపురం వాసులు

కృష్ణలంక 22వ డివిజన్ బ్రమరాంభపురం పరిధిలోని స్వర్గపురి-పద్మావతి ఘాట్ పరిసర ఏరియాల్లో భయానక వాతావరణం ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో నివశించే ప్రజలు నిత్యం భీతిల్లిపోతున్నారు. గంజాయి, మద్యం, జూదం, ఇతర అనేక వ్యసనాలు కల్గిన డెకాయిటీలు, బ్లేడ్ బ్యాచ్ బెడద ఈ ప్రాంతంలో రోజు రోజుకు పెరిగిపోతోంది. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు సోద్యం చూస్తున్నారు. దీంతో తమకు ఎదురే లేదన్నట్లుగా మందుబాబులు స్వైరవిహారం చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయవాడ : పగలు...రాత్రి అనే తేడా లేకుండా ఈ ప్రాంతంలోని బార్లు ముందు పీకల్లోతు తాగి మత్తులో నడి రోడ్డుపైనే దొర్లుతున్నారు. గంజాయి, మందుబాబులను దాటుకుంటూ... ఫీడర్ రోడ్డు మెట్లు ఎక్కి ప్రధాన రహదారిపైకి స్థానిక ప్రజలు చేరుకోవాల్సి వస్తోంది. విశాఖ ఏజెన్సీతోపాటు ఆయా సుదూరు ప్రాంతాల నుంచి అత్యంత రహస్యంగా ఈ ప్రాంతానికి గంజాయి భారీ మొత్తంలోనే డంప్ అవుతుంటుంది. దీనిపై కేంద్రీకరణ పెట్టాల్సిన పోలీసులు, ఇతర శాఖల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ, మొక్కుబడి తనిఖీలకు పరిమితం అవుతున్నారు. పొద్దు కూకిన తరువాత స్వర్గపురి- పద్మావతి ఘాట్ ప్రాంతానికి వెళ్లడానికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహిళలు సహశించి వెళ్లలేని పరిస్తితి తయారయింది. స్వర్గపురి-పద్మావతి ఘాట్ మందుబాబులు, గంజాయి ప్రియులకు ఒక కేంద్రంగా తయారయింది. పట్టపగలు కూడా తప్పతాగి, గంజాయి మత్తులో తూగుతుంటారు. సాయంత్రం కానీ, చీకటిపడిన తరువాత ఎవరైనా ఈ ప్రాంతానికి వస్తే అటువంటి వారిని చాకు, బ్లేడ్‌తో బెదిరించి వారి వద్ద నుంచి విలువైన వస్తువులను లాక్కొని పరారవుతున్న పరిస్తితి సర్వసాధారణం. కృష్ణలంక పోలీస్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉండే ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు గస్తీ తిరుగుతూ...పెట్రోలింగ్ నిర్వహిస్తూ... మందుబాబుల ఆగడాలను నియంత్రించాల్సిన పోలీసులు ....నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే చర్చ , విమర్శ లేకపోలేదు. ఇష్టారాజ్యంగా నడిరోడ్డుపై పెద్ద ఎత్తున వాహనాల పార్కింగ్ వలన స్వర్గపురి వెళ్లే రహదారి కుదించుకుపోతూ...దహన సంస్కారాలకు స్వర్గపురి స్మశానానికి వాహనాల్లో వెళ్లడానికి ట్రాఫిక్ రద్దీ ఏర్పడి...తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం పద్మావతి ఘాట్‌పై స్థానిక ఆ ఏరియా నివాసులు వాకింగ్ చేయడానికి కూడా భయాందోళనకు గురిఅవుతున్నారు. ఎప్పుడు ఎవరు వచ్చి దాడి చేస్తారోననే భయాందోళనలో ఈ ప్రాంతానికి ప్రజలు వెళ్లడానికి భయపడిపోతున్నారు. ఫీడర్ రోడ్డులోనే బార్లు విచ్చల విడిగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా 24 గంటలు రన్నింగ్‌లో ఉండటంతో మందుబాబుల ఆగడాలు రోజు రోజుకు పెచ్చుమీరి పోతున్నాయి. మందుబాబుల ఆగడాలు, పెరిగిపోతున్న వాహనాల రద్దీతో స్వర్గపురి రోడ్డు మొత్తం ఆక్రమణలతో నిండిపోయి, ప్రజల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. పద్మావతి ఘాట్ పైనే మందుబాబులు, గంజాయి బ్యాచ్, అసాంఘిక శక్తులకు నియంగా మారింది. అలాగే నిత్యం రద్దీగా ఉండే పిఎన్ బస్‌స్టేషన్ ఏరియాలో కూడా అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. బ్లేడ్‌బ్యాచ్, దొంగలు, మద్యం, గంజాయి బ్యాచ్‌లు కూడా పెరిగిపోతున్నారు. ఇటు స్వర్గపురి రోడ్డు, అటు పిఎన్ బస్‌స్టేషన్, ఫీడర్ రోడ్డు ఈ ప్రాంతాల్లో 24 గంటల పాటు మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నా... పట్టించుకునే నాథుడే ఉండటం లేదు. కృష్ణలంక పోలీసులు ఈ ప్రాంతాల్లో మొక్కుబడి విజిట్స్ తప్పా...చిత్తశుద్ధితో అసాంఘిక శక్తుల ఆగడాలు నియంత్రించాలనే చిత్తశుద్ధి లేదని చెప్పవచ్చు. పిఎన్ బస్‌స్టేషన్ ఎదురుగా ఫీడర్ రోడ్డులో విచ్చల విడిగా బార్ ఓపెన్ చేస్తూ మద్యం ప్రియులకు ఈ ఏరియా అడ్డాగా మారింది. ఇప్పటికయినా గంజాయి, మద్యం తదితర వాటిని నియంత్రించి, మందుబాబుల, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను నియంత్రించాల్సిన అవసరం, కర్తవ్యం పోలీసులు, ఆర్టీసి, ఎక్సైజ్, ఇతర అదికారులపై ఎంతైనా ఉందని చెప్పక తప్పదు. లేనట్లయితే ఈ ఏరియా గంజాయికి, మద్యానికి అడ్డాగా మారిపోయి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారయ్యి ప్రజలు ఉండటానికి కూడా వీలు లేకుండా పోయే ప్రమాదం ఉందని ప్రజలు భీతిల్లిపోతున్నారు.



పద్మావతి ఘాట్ వద్ద పరిస్థితి



స్వర్గపురి ప్రాంతం...

గృహ నిర్మాణ శాఖ కార్యాలయం తెరిచేదెన్నడో....?

• లబ్ధిదారుల ఇక్కట్లు తీరేదెన్నడో...!



పని వేళల్లో తాళం వేసిఉన్న గృహ నిర్మాణ శాఖ కార్యాలయం

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రభుత్వం పేద లబ్దిదారులకు నివేశనా స్థలాలు ఇచ్చి గృహనిర్మాణాలు చేపట్టేందుకు ప్రోత్సహిస్తోంది. అయితే ఘంటసాల మండలం గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో ఎప్పుడు తెరుచుకుం టుందో, ఎప్పుడు మూసి ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా ఉన్న లబ్దిదారులు వారికి ఇసుక కూపన్లు, మెటీరియల్, ఇతర అవసరాల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గహనిర్మాణ కార్యాలయానికి వచ్చి చూస్తే ఎప్పుడు తలుపులకు తాళాలు వేసి దర్శనమిస్తాయి. సిబ్బంది ఉన్నారో లేదో తెలియని పరిస్థితి. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారికి ఫోన్ చేసి సమాచారం అడిగితే ఇదిగో ఈ రోజే వస్తున్నాను మీ సమస్యలన్ని పరిష్కారమవుతాయని చెబుతు వస్తున్నారు. కార్యాల యానికి వచ్చి ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయకపోవటంతో గంటల తరబడి కార్యాలయం ముందు ఎదురుచూసి విసుగెత్తి ఇళ్లకు వెళ్లిపోవటం లబ్దిదారులకు పరిపాటిగా మారింది. కనీసం ఆఫీస్ సిబ్బంది సైతం తాళాలు తీసి కార్యాలయంలో ఉండని దుస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన లబ్దిదారులు తమ గోడు పట్టించుకునే వారెవ్వరు అంటూ ఊసూరు మంటు వెనుతిరిగి వెళ్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా మండల స్థాయిలో ఆ శాఖను పర్యవేక్షించాల్సిన అధికారిణి కూడా పట్టించుకోకపోవటం పట్ల అధికారులు అంతా ఇంతే అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా గృహనిర్మాణ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు పడలేదని అడిగితే ఇదిగో అదిగో అంటూ కళ్లబొల్లి మాయమాటలు చెప్పటం తప్ప వాటి గురించి చెప్పే వారే లేరని, కనీసం సమాచారం ఇవ్వటానికైనా కార్యాలయం తెరవాలని ప్రజలు కోరటం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి గహనిర్మాణ శాఖ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియ లలిత

విద్యతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఘంటసాల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా.సత్యప్రియ లలిత తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా యూనివర్సిటీ బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలు మంగళవారం ప్రారంభించారు. తొలిరోజు స్థానిక బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామివారి దేవాలయం ఆవరణలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రియ లలిత మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం కలిగి ఉండటం మంచి లక్షణం అన్నారు. ఘంటసాల కషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.పి.శ్రీలత, పలువురు ప్రముఖులు ప్రసంగించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త నవీన్, మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకష్ణ, ఉపాధ్యాయులు జొన్నలగడ్డ రామారావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు అవర్ణ, విజయ్ కుమార్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కె.వి ఆర్టీసీ ఫీడర్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హరిజనవాడ, గ్యాస్ కంపెనీ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, విద్యానగర్, శ్రీనగర్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్, గాంధీ బొమ్మ సెంటర్, బుద్ధ వరం రోడ్డు, గౌడ్ పేట. ఎండిఓ ఆఫీస్ ఏరియా, మదర్ తెరిసా కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డు, ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడునని పేర్కొన్నారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు అందరూ సహకరిం చగలరని కోరారు.

వైమానిక దళం రిక్రూట్మెంట్ ర్యాలీకి పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 22వ తేదీ నుండి అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) కోసం భారతీయ వైమానిక దళం రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి గల అవివాహితులైన స్త్రీ పురుషులు తమ పేర్లను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిపథ్ పథకం కింద కాన్పూర్‌లోని 3 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్, బెంగుళూరులోని 7 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్ లలో అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్మెంట్ ర్యాలీ ఈ నెల 22వ తేదీ నుండి వచ్చే జూన్ నెల 5వ తేదీ వరకు నిర్వహిస్తోందని కలెక్టర్ వివరించారు. ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటల నుండి హెచ్ టి టి పి ఎస్://అగ్నిపథ్ వాయు డాట్ సిడిఏసి డాట్ ఇన్ https://agnipa thvayu.cdac.in వెబ్ పోర్టల్ లో ఆసక్తిగల 10 వ తరగతి ఉత్తీర్ణులైన అవివాహిత స్త్రీ పురుషులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం సికింద్రాబాద్ లోని భారతీయ వైమానిక దళం సెలక్షన్ సెంటర్ వింగ్ కమాండర్ కమాండింగ్ అధికారి గురుప్రీత్ అత్వాల్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఇతర వివరాలకు నోటిఫికేషన్, వెబ్ పోర్టల్ ను పరిశీలించాలన్నారు.


నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ



ఎన్నికల నిబంధనలపై మాట్లాడుతున్న ఎస్సై గణేష్ కుమార్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఎన్నికలు, ఫలితాలకు సంబంధించి ఎన్నికల కోడ్, 144వ సెక్షన్, సీఆర్పీసీ సెక్షన్ 30 ఉల్లంఘించి అలర్లు, అలజ డులు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశకుమార్ హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల దష్ట్యా ముందస్తు ఆదేశాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో పలురుతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళి, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా తీసుకునే చర్యలు తెలిజేశారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, విజయోత్సవర్యాలీలు నిర్వహించ ాదన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు ప్రచారం చేయడం నేరమని, అవిధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యంషాపుల వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, మద్యం సేవించి గొడవలు సష్టించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు.

వెలగని వీధిలైట్లు...పల్లెల్లో చీకట్లు



ఎల్ఈడి లైటు వేయకుండా వదిలేసిన దృశ్యం



ఎల్ఈడి బల్బుకు బదులు బల్బు వేసిన దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా మారింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయ వాడ రూరల్ మండలాల్లో 84 పంచాయితీలు ఉన్నాయి. అందులో 20 మేజర్ పంచాయతీలున్నాయి. మిగిలినవన్నీ మైనర్ పంచాయతీలే. మేజర్ పంచాయతీల్లో ఆర్థిక పరిస్థితి బాగున్న మైనర్ పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది.

విద్యుత్తు ఆదాతో పాటు పంచాయితీలపై నిర్వహణ భారం తగ్గించేందుకు గతంలోనే స్తంభాలకు ఎస్ఈడీ దీపాలు బిగించారు. నిర్వహణ బాధ్యతలను ఇంధన సామర్థ్య సేవల సంస్థకు అప్పగించారు. ఎస్ఈడీ దీపాల వినియోగం ద్వారా ఆదా అయిన సొమ్ముాయిదాల రూపంలో లైట్లు సరఫరా చేసే సంస్థకు చెల్లిస్తే సరిపోతుందని అధికారులు అప్పట్లో చెప్పారు. కొంతకాలం పాటు సక్రమంగా నిర్వహించినా.. ఆ తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఇవి ఎక్కడికక్కడ మూలనపడ్డాయి. వీటి స్థానంలో తిరిగి చిన్న బల్బుల కొనుగోలు చేశారు. గతంలో వాడిన ఎల్డీ దీపాలకు చేసిన ఖర్చును ప్రస్తుతం పంచాయతీల నుంచి ప్రభుత్వం తీసుకుంది. రెండేళ్లుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సర్పంచులు, అధికారులకు కూడా తెలియకుండా దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా కనీస అభివృద్ధి అనేది లేకుండాపోయింది. దీంతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేక పోతున్నామని సర్పంచులు వాపోతున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యమే : గ్రామ పంచాయతీలపై వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వీధి దీపాలుగా ఎస్ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ చాలా చౌకగా ఉండటం, విద్యుత్తు వినియోగం కూడా పెద్దగా ఉండకపోవడంతో వీటిని వినియోగిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను ఈసీఎల్ కార్పొరేషన్, నెడ్క్యాప్ సంస్థలకు అప్పగించారు. 2019 తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వీరికి నిర్వహణ నిధులు సక్రమంగా ఇవ్వకపోవడంతో వీరు 2020లో తమ వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో అనేక గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి. ప్రజల బాధలు చూడలేని కొందరు సర్పంచులు సాధారణ నిధులు నుంచి ఎస్ఈడీ బల్బుల స్థానంలో మళ్లీ స్తంభాలకు సాధారణ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. 2021 ఏప్రిల్లో పంచాయతీల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాల అభివద్ధికి పంచాయతీ ఖాతాలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయనేలేదు. ప్రభుత్వం ఎల్ ఈడి లైట్ల నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో 40 శాతానికిపైగా వెలగడం లేదు. కనీస మరమ్మతులు కూడా చేయించే పరిస్థితి లేదు. వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేవారు కూడా కరవ-య్యారు. ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవడంతో సర్పంచులుసైతం వీధి దీపాలు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

300 లీటర్ల మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి హనిమి రెడ్డి కాంప్లెక్స్‌లోని ఐ నీడ్స్ ఆప్టికల్స్ ఎనిమిదో వార్షి కోత్సవ సందర్భం గా మంగళ వారం హనీమి రెడ్డి కాంప్లెక్స్ వద్ద బాటసారులకు 300 లీటర్ల మజ్జిగను వైసిపి మైలవరం పట్టణ అధ్యక్షులు పాల నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కస్టమర్ల మన్ననలను పొందుతూ 8వ సంతంలోకి అడిగిడుతున్న ఐ నీడ్స్ అధినేత పుల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, శివ, మల్లికార్జున రావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న నాగరాజు

ఉపాధి కార్మికులకు 200 రోజులు పని కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజా శక్తి - ఎ.కొండూరు, విస్సన్నపేట : ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వారికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మంగళవారం ఎ.కొండూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కంభంపాడు గ్రామ సమీపంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వసతులైన తాగునీరు టెంట్లు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు కూడా సమకూర్చడం లేదని ఆరోపించారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, ఫొటో తీసే పద్ధతిని తొలగించాలని అన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకు 300 తగ్గకుండా ఇవ్వాలని కూలి వారాల తరబడి పెండింగులు పెట్టకుండా సకాలంలో చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి.ఆనందరావు, భూక్య జమలమ్మ, సంఘ సభ్యులు ఉషారాణి, నందిని, లక్ష్మీ తిరుపతమ్మ, నాగరాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో దేవస్థాన వంశపారం పర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీ స్వామికి శేష వాహన సేవ నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉల్లిందన వాస్తవ్యులు బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానానికి వచ్చే యాత్రికులకు అన్నదానము ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శిరపరపు హేమలత దేవి తెలిపారు.

144 సెక్షన్ అమలు



వత్సవాయిలో పర్యటిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - వత్సవాయి : ఎన్నికల కోడ్, సెక్షన్ 144 సిఆర్‌పి.సి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉండటంతో ఏ ప్రాంతంలోనూ నలుగురు కన్నా ఎక్కువ మంది ఒక చోట గుమికూడి ఉండకూడదని వత్సవాయి ఎస్ఐ అభిమన్య తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా, బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ కూడదని, వత్సవాయి ఎస్ఐ అభిమన్య తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను/కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేయటం నేరంని హెచ్చరించారు. అలా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా కాల్చటం నేరమన్నారు. ఇతర పార్టీ అభ్యర్థులచ కార్యకర్తల ఇంటి ముందు కవ్వించేలా బాణాసంచా కాల్చి రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉద్దేశపూర్వకంగా సివిల్ తగాదాలను అడ్డుపెట్టుకొని, చట్ట వ్యతిరేకంగా రెండు వర్గాల మధ్య కానీ, రెండు పార్టీల మధ్య కానీ గొడవలు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా గుంపులు, గుంపులుగా చేరి ప్రజా జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోబడతాయి. తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా తిరిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, పోలీస్ వారికి వెంటనే సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పైన తెలిపిన సూచనలను, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణం జీవనం సాగించటంలో, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలందరూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించి, వారి ముందస్తు సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు.

నందిగామ : నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండల పరిధిలోని జమ్మవరం గ్రామంలో డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ రవికిరణ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి ఇతరులపై గొడవలకు లేదా దాడులకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 144 సెక్షన్, సెక్షన్ 30 అమలులో ఉన్న నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా బాణాసంచా కాల్చిన డీజేలు ఏర్పాటు చేసిన ర్యాలీలు నిర్వహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాల రోజు ప్రతి ఒక్కరు సమన్వయం పాటించాలని కవ్వింపు చర్యలకు పాల్పడిన దాడులకు తెగబడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర రావు ఎస్ఐ మహా లక్ష్మణుడు సిబ్బంది పాల్గొన్నారు.



వత్సవాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



నందిగామలో తనిఖీలు చేస్తున్న ఎసిపి రవికిరణ్, పోలీసులు

వెంటనే జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైం స్టోన్ మైన్స్‌లో యూనియన్ నాయకులు, ఉద్యోగులు సకాలంలో జీతాలు చెల్లించలేదని అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్ర్యమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు 20 తేదీ వచ్చినా చెల్లించకపోవడం దారుణమని, రూ.23,467 కోట్లు టర్నోవర్ ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కి, సమయానికి జీతాలు చెల్లించలేని దుస్థితి రావడం విచారకరమని దుయ్యబట్టారు. దీనికి కారణం చేతకాని మేనేజ్మెంట్ అని వాపోయారు. ఇప్పటికైనా పరిస్థితిని చక్కబెట్టి సకాలంలో జీతాలు చెల్లించాలని, లేదంటే ముందు జరగబోయే పరిణామాలకు మేనేజ్‌మెంట్ బాధ్యత వహించాలని ప్రస్తావించారు. ఈ సందర్భంగా డిజిఎం (మైన్స్) ఇన్చార్జి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. మైన్స్ ఇన్‌చార్జ్ నాగరాజు మాట్లాడుతూ ఈ సమస్య గురించిపై అధికారులతో మాట్లాడుతున్నామని త్వరలోనే పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి ఐఎన్‌టియుసి, సిఐటియు, బి ఎం ఎస్, డిఐటియు యూనియన్ నాయకులు రామచందర్ నాయక్, మన్నే శ్రీనివాసరావు, జెవిఎస్‌డి ప్రసాద్, విశ్వాస రావు, దేవోజి, విజయ్ కుమార్, ఉద్యోగులు టి.కోటేశ్వరరావు, నవీన్, ఎస్ కెబిఎస్.వర్మ, హేమ నాయక్, దేవోజి, ఠాగూర్, ఏ ఆర్ కె ప్రసాద్, సురేంద్రనాయక్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జీతాలివ్వాలని డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు

నందిగామలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - నందిగామ : విజయవాడ కమిషనరేట్ సీపీ ఉత్తర్వుల మేరకు, డీసీపీ ఆదేశాలపై నందిగామ ఏసీపీ, సీసీఎస్ ఏసీపీ ఆధ్వర్యంలో నందిగామ పరిధిలో గల డివిఆర్ కాలనీలో పోలీసులు మంగళవారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి డాక్యుమెంట్స్ లేని వాహనాలను సీజ్ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ఐరిష్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ ఎసిపి రవి కిరణ్ మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్ లిమిట్స్ గల డివిఆర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు. దాదాపు 500 గృహాలు తనిఖీ చేశామని పేర్కొన్నారు. ఎటువంటి రికార్డు లేని 27 బైకులు, 22 ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐరిష్ మొబైల్ ద్వారా 72 మంది అనుమానితులను తనిఖీ చేశామని, వారిలో ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ తర్వాత కూడా ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ఉండటానికి కూడా ముందస్తు జాగ్రత్తగా కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేశామని పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలందరూ ఒకే చోట ఎక్కువగా ఉండకూడదని, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఇరు పార్టీలు కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండాలని, దానిలో భాగంగానే మంగళవారం కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేశామని ఏసీపీ తెలిపారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో నందిగామ సిఐ హనీష్, ఎస్ఐలు పండుదొర, దుర్గా మహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





శిక్షణా శిబిరంలో మల్లిక, విద్యార్థులు, పిఇటి

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయం ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో ఐదో రోజు మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. క్రాఫ్ట్‌లో భాగంగా దారంతో డిజైన్ గాజులు తయారు చేసే విధానాన్ని బీడీసీ మల్లిక నేర్పి విద్యార్థులతో తయారు చేయించారు. చివరగా అనుమంచిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఈటీ ఉపాధ్యాయురాలు ఎం.మణిరత్నం చదరంగంలో బేసిక్ స్కిల్స్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యవతి, ఉపాధ్యాయుడు డి.బాబురావు పాల్గొన్నారు.

ఉప్పలమ్మ కొలువు

ప్రజాశక్తి - వత్సవాయి : ఉప్పలమ్మ తల్లి కొలుపు కార్యక్రమంలో శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, వత్సవాయి మండలంలోని ఇందుగుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మొల కృష్ణారావు ఉప్పలమ్మ తల్లి కొలువు ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట మండలం గండ్రాయిలో ఏర్పాటు చేసిన ఉప్పలమ్మ కొలువులో గ్రామ టిడిపి అధ్యక్షులు పల్లెబోయిన నాగరాజు ఉప్పలమ్మ తల్లి కొలుపు కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రత : కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్ రూములకు మూడంచెల పటిష్టమైన భద్రత కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాల్లో త్రాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితి, ఉపాధి హామీ, శాంతిభద్రతలు అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ విసీ హాల్ నుండి సిఎస్ వీసీలో పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి, విద్యుత్ సరఫరా పరిస్థితి సిఎస్‌కు కలెక్టర్ వివరించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు స్థానిక కష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్ రూములకు మూడంచెలతో పటిష్టమైన భద్రత కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జూన్ రెండో వారంలో రైతులు తొలకరి పంటల సాగు ప్రారంభిస్తారని, గత అనుభవాల దష్ట్యా తుఫాను పరిస్థితుల్లో ముంపును నివారించి రైతులకు పంట నష్టం జరగకుండా కాలువలు డ్రెయిన్ లలో తూడు తొలగించి కాలువలలో నీటి ప్రవాహం సజావుగా ఉండేందుకు ముంపు నివారణ చర్యలు చేపట్టవలసి ఉందని కలెక్టర్ సిఎస్ దష్టికి తీసుకెళ్లారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్ డబ్ల్యు ఈఈ టి. శివప్రసాద్, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, వైయస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, బాలసుబ్రమణ్యం, పి. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గురువిందుగుంటలో ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెడన : అంచనాలు రూపొందించామని పూర్తిస్థాయిలో పనులు జరగలేదని అంబుల్స్ పర్సన్ కెవి శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గురువిందుగుంటలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో అమలుపరిచిన పంట బోదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. గురువింద గుంట 1100 మీటర్ల దూరంలో తవ్వేందుకు సిద్ధం చేసిన పంట కాలువను అంచనాలు మాత్రమే వేశామన్నారు. అయితే కేవలం 250 మీటర్లు మాత్రమే ఉపాధి కూలీల చేత పనులు చేయించామని స్పష్టతనిచ్చారు. మునుముందు ఎస్ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పంటబోదులను, కాల్వలను యంత్రాలతోటి తవ్వేందుకు అనుమతులు జారీ చేసే విధంగా ఉంటుందంటూ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా మండల పరిధిలోని పెనుమల్లి, నందిగామ గ్రామాల్లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు.

ఉన్నతాధికారులు ఎక్కడ : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని పెడన మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో అవకతవకలు భారీగా జరుగుతున్న ఉన్నతాధికారులు స్పందించకపోవడం పని తీరుకు అద్దం పడుతుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం జరుగుతుంటే కనీసం ఉన్నతాధికారులు స్పందించక పోవడం అనుమానాలు తవిస్తోంది. లక్షలాది రూపాయలు కుంభకోణం జరిగిన కనీసం ఆయా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు స్పందించకుండా కేవలం కష్ణ జిల్లా విజిలెన్స్ అంబుడ్స్ పర్సన్ విచారణకు రావడం పలు ఆనుమానాలు తావిస్తోంది. ఈ కుంభకోణంలో ఉన్నతా అధికారులు కూడా పాత్ర ఉందని పలువురు రైతు కూలీ సంఘాలు ఆరోపణ చేస్తున్నాయి.

మరియమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు యాకమూరు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు యేసు మరియమ్మ మరణం పార్టీకి తీరని లోటు అని టిడిపి పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని యాకమూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు చదలవాడ యేసు మరియమ్మ మంగళవారం అనారోగ్యంతో మతి చెందారు. ఏసు మరియమ్మ పార్థివదేహానికి పామర్రు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి వర్ల కుమార్ రాజా పూలమాలవేసి నివాళు లర్పించారు. అంత్యక్రియలో పాల్గొన్నారు. వీరితోపాటు ఉప్పులేటి కల్పన , వీరప్పనేని శివరాం, శనివారపు కష్ణ సుమన్, చొప్పరపు సుబ్రమణ్యం, వీరంకి వరహాలు రావు, గోళ్ళ సుబ్రహ్మాణ్యం, ఒంపు గడవల పండు, పాల్గొని నివాళులర్పించారు.

యూనియన్‌లో చేరిక

ప్రజాశక్తి - గుడివాడ : ది గుడివాడ ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం)లో 5మంది కొత్త సభ్యులు పి అజయ్ కుమార్, పి క్రాంతి కుమార్, వి జోసఫ్, వి యోహాను, ఎం కుమార్‌బాబులు చేరినట్లు సంఘ ప్రధాన కార్యదర్శి కొమ్ముల సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గుడివాడ ఏరియా కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికీ భత్యం చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి

ప్రజాశక్తి - గుడివాడ : ఈనెల 13వ తారీకు అసెంబ్లీ, పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో పని చేసిన వారికి భత్యం వెంటనే చెల్లించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సిఐటియు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలోని మున్సిపాలి టీలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ అలాగే రెవిన్యూలోని వీఆర్‌ఏలతో ఎన్నికల అధికారులు పనులు చేపించారు కానీ వీళ్ళకి మాత్రం ఎలాంటి భత్యం ఇవ్వలేదన్నారు. మిగిలిన పర్మనెంట్ ఎంప్లాయిస్‌కి అందరికీ ఎన్నికల్లో పనిచేసినందుకు భత్యం ఇచ్చి మిగిలిన వాళ్ళకి ఇవ్వకపోవడం చాలా అన్యాయం అన్నారు. వీళ్ళు కూడా మునిసిపాలిటీలో సుమారు మూడు నాలుగు రోజులు ఎన్నికల నిధులు నిర్వహించడం జరిగిందని, ఆ ఎన్నికల విధుల్లో కూడా అనేక ఇబ్బందులు పడి వాళ్ళు విధులు నిర్వహించారు కాబట్టి వాళ్లకు కూడా పారిదోషం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ధనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. జేకేసి కోఆర్డినేటర్ వర్ల అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా హానర్ న్యూ ల్యాండ్ ఎ మెన్స్ ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఎంఎస్సీ బీటెక్ ఐటిఐ డిప్లమో ఇతర డిగ్రీ అభ్యర్థులు 90 మంది హాజరయ్యారు. అరబిందో హానర్ న్యూ ల్యాండ్ ఫార్మా కంపెనీలు 24 మంది, ఏ మెన్స్ ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరుకి ఐదు మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమా రాణి తెలిపారు. హైదరాబాద్ కు చెందిన వి ఎల్ ఆర్ ఫెసిలిటేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కళాశాలతో చేసుకున్న భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరవ సెమిస్టర్ అయిన వెంటనే వివిధ కంపెనీలను కళాశాలకు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కషి చేస్తామని తెలిపారు. కళాశాల ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

వైద్య ఆరోగ్య శాఖపై ప్రతివారం సమీక్ష : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అమలయ్యే వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలు ప్రతి వారం సమీక్షిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిల పనితీరు, ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె గీతా బాయి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు 49 పి హెచ్ సి లు, మచిలీపట్నంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుడివాడలో ఏరియా ఆసుపత్రి, 13 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వాటిల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది, ఖాళీల వివరాలు కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు వాటి ప్రగతి గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలయ్యాక వైద్య ఆరోగ్యశాఖ వాటి అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని సంబంధిత వైద్యాధికారులకు సూచిస్తూ, తాను ప్రతి వారం వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షిస్తానని అన్నారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది క్యాడర్ వారీగా నిర్వర్తించాల్సిన విధులు, వారి పరిధిలో పారామీటర్లు వాటికి సంబంధించిన మొబైల్ యాప్, సాధించాల్సిన ప్రగతి గురించి జూన్ 18 న సమావేశం నిర్వహించి సమీక్షిస్తామన్నారు. ఈలోగా ఆయా సిబ్బంది కేడర్ వారీగా జాబ్ చార్టులు, వారికి నిర్దేశించిన విధుల గురించి ప్రణాళిక రూపొందించి పి పి టి సిద్ధం చేయాలని డి ఎం అండ్ హెచ్ ఓ ను ఆదేశించారు. ఏవైనా కోర్టు కేసులు ఉంటే కోర్టు ధిక్కరణకు అవకాశం లేకుండా ఎలాంటి ఆలస్యం కాకుండా సకాలంలో కౌంటర్లు వేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, టి బి, మలేరియా తదితర వైద్య విభాగాల ఒతంగా నిర్వహించిన కోఆర్డినేటర్ అరుణ కుమారిని కళాశాల సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

పట్టుకున్నారు.. వదిలేసారు..

- **జెసిబిలు, ట్రాక్టర్లు వదిలేయడంపై సర్వత్రా విమర్శలు**

ప్రజాశక్తి-పెడన : మండల పరిధిలోని నందమూరిలో మంగళవారం అక్రమంగా మట్టి తోలుతున్న మూడు జెసిబిలను,7 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకుని వదిలేయడం మండలంలో సర్వత్ర చర్చనీయంగా మారింది. నందమూరి నుంచి పెడన, మచిలీపట్నం, నిడుమోలు గ్రామాలకు బసక, నల్ల రేగడి మట్టి తరలిస్తున్నట్లు స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి గ్రామస్తులు సమాచారం అందించారు. ఈ మేరకు తాసిల్దార్ ఆదేశాలు మేరకు గ్రామ విఆర్వో పరసా కిషోర్ బాబు గ్రామ వీఆర్ఏ ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పనుల్లో నిమగ్నమైన వాహనాలు చూసి ఒకసారిగా అవ్వక్కయ్యారు. అంతే వెంటనే వాహన యజమానులకు సమాచారం మాధ్యమాల ద్వారా డ్రైవర్లు విషయం తెలిపారు. దీంతో యజమానులు స్థానిక తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్, అలాగే రెవిన్యూ ఇన్స్పెక్టర్ లతో మంతనాలు జరిపి ఒక్క వాహనం కూడా గ్రామం నుంచి కార్యాలయానికి వెళ్ళనీయకుండా నిలుపుదల చేశారు. అంతేకాకుండా భారీ మొత్తంలో మామూళ్లు ముట్ట చెప్పినట్లు సమాచారం. దీనిపై స్థానిక తహసిల్దార్ ను వివరణ కోరగా ఆ గ్రామంలోని జేసిబిలు పనులు చేయడం లేదని, పనులు జరిగేటప్పుడు మాత్రమే వాటిని సీజ్ చేసే అధికారం ఉందని వివరణ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

అవాస్తవాలను ప్రచారం చేయొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఎన్నికలు జరిగిన నేపథ్యంలో సోషల్ మీడియా ప్రతినిధులు అవాస్త విషయాలను ప్రజలకు తెలియజేయవద్దని పమిడిముక్కల ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన సోషల్‌మీడియా ప్రతినిధులతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు తెలిసిన తరువాత సమయం పాటించి ప్రజలకు క్రమశిక్షణ కలిగే విధంగా పోస్టులు పెట్టాలని సూచించారు. లంకపల్లి, మంటాడ, కష్ణాపురం, కపిలేశ్వరపురం తదితర సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ నిఘా ఉందని అన్నారు. జూదం, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గణిత సూత్రాలపై అవగాహన

ప్రజాశక్తి -ఉయ్యూరు : శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిభిరంలో భాగంగా మంగళవారం గణిత సూత్రాలు, లెక్కలు సులువుగా చేసే విధానంపై రిసోర్స్పర్సన్ ఎస్ మహేశ్ విద్యార్థులకు తెలియజేశారు. వేసవిశెలవుల్లో పాఠ్యాంశాలు మరచి పోకుండా కొంత స మయాన్ని కేటాయించాలని సూచించారు. ఈసందర్భంగా పుస్తక పఠనం గావించి క థలు చెప్పించారు. గ్రంథాలయ అధికారి రమణి, సిబ్బంది పాల్గొన్నారు.



గణిత సూత్రాలు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్ మహేశ్



క్రికెట్ టీమ్‌కు బ్యాట్‌లను బహూకరిస్తున్న కార్పొరేటర్ అబ్దుల్ హర్షద్

టీమ్‌కు ఆర్థిక సాయం, క్రికెట్ కిట్లు పంపిణీ

క్రీడా స్ఫూర్తిని చాటుకున్న కార్పొరేటర్ హర్షద్

ప్రజాశక్తి, వన్‌టౌన్ : యువత క్రీడారంగంలో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ హర్షాద్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో షణ్ముఖ సహారా క్రికెట్ టీంకు 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా హర్షద్ మాట్లాడుతూ క్రికెట్లో భారతదేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని అన్నారు. యువతి యువకులు ఎక్కువగా క్రికెట్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మన దేశం నుంచి అత్యుత్తమ క్రీడాకారులు క్రికెట్లో రాణిస్తున్నారని ఆయన అన్నారు. క్రీడా రంగానికి సంబంధించి క్రికెట్ ఆటలో యువతను ఎక్కువగా ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రికెట్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

భీమా జ్యుయలర్స్ నుండి జింగ్ కలెక్షన్స్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నమ్మకం, నాణ్యతకు ప్రతి రూపంగా నిలిచిన భీమా జ్యువెలర్స్ సరికొత్తగా జింగ్ కలెక్షన్లను విడుదల చేసినట్లు షోరూమ్ ఇన్‌ఛార్జి కె.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని బీమా జ్యువెలర్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజువారీ ఆభరణాల్లో శైలి, ఆచరణాత్మకత సమ్మేళనాన్ని కోరుకునే ఆధునిక మహిళల కోసం వీటిని రూపొందించినట్లు తెలిపారు. అతి సున్నితమైన ఈ తేలికపాటి 22 కేరట్ బంగారు ఆభరణాలు సమిష్టి సమకాలీన అంశాలకు అనుగుణం ఆభరణాలను అందిస్తున్నామని తెలిపారు. అందమైన నెక్లెస్‌ల నుండి సొగసైన చెవిపోగులు, బ్రాస్‌లెట్‌ల వరకు జింగ్ కలెక్షన్‌లోని ప్రతి ఆభరణం,జ్యువెలర్స్ నాణ్యత, నైపుణయయం పట్ల భీమా జ్యువెలర్స్ నిబద్దత ప్రతిబింబిస్తుందన్నారు. రానున్న కాలంలో మహిళల కోసం మరిన్ని ఆభరణాలను అందించేలా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

డిజైన్ థింకింగ్ వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా డిజైన్ థింకింగ్ అండ్‌ట్రైనింగ్ వర్క్‌షాపును ప్రారంభించినట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.ఈశ్వర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఓ హొటల్‌లో వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని తెలిపారు.శాంసంగ్ యొక్క ఫర్ టుమారో ప్రోగ్రామ్‌లో భాగమైన ఈప్రత్యేకమైన చొరవ, మానవ కేంద్రీకృత డిజైన్ థింకింగ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా విద్యార్థులలో సమస్య పరిష్కానర విమర్శనాత్మక ఆలోచన, పరిశీలన, సృజనాత్మకత వంటి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా వర్క్‌షాపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం జాతీయ విద్య, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించే విధంగా డిజైన్ చేసినట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు - అక్రమ కట్టడాలతో పలు సమస్యలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో పాత బస్టాండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శలు వ్యక్తమయ్యాయి. టిబి రోడ్డులో మున్సిపాలిటీ కాలువపై 4 అడుగులు ఆక్రమించి షాపులు కట్టారు. మున్సిపాలిటీ కాలువపై బ్లాక్‌లు వేయకుండా ఏకంగా 20 అడుగుల స్లాబ్ వేసి కాలువ క్లోజ్ చేశారు. రేపు కాలువలో డ్రైనేజి సమస్య వస్తే అక్కడ ఎలా శుభ్రం చేయాలి. మునిసిపల్ కాలువపై వేసిన 20 అడుగుల స్లాబ్ కింద చెత్త పెరుకపోతే మురుగు అంత రోడ్డు పైకి వస్తే, ప్రజలు అనారోగ్యం బారిన పడితే, ఎవరు బాధ్యత తీసుకుంటారు, అది ఎవరి తప్పిదం అని స్థానికులు బాషా, పలువురు విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. టిబి రోడ్డు అంచుకి మెట్లు కట్టారు. దీనివల్ల రోడ్డుపై వచ్చే వాహనాలకు ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. టిబి రోడ్డు అంచుకు ఏకంగా ఫ్లోరింగ్ లాగారు. దీంతో వాహనాలు జారి ప్రమాదాలు జరగవచ్చు. ముఖ్యంగా అసలు బిల్డింగ్‌కి మున్సిపాలిటీ నిర్మాణం అనుమతులు లేవు. ఎటువంటి అనుమతులూ లేకుండా 4 స్లాబ్‌లు వేసిన మునిసిపల్ కమిషనర్, సిబ్బంది పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలను అతిక్రమించి అక్రమ కట్టడాలు కడుతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బందిని కూడా లెక్క చేయ కుండా, నిర్మాణ పనులు యథేచ్ఛగా జరుగుతు న్నాయంటే మర్మం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే నందిగామలో ఇంకెవరు మునిసిపల్ పర్మిషన్‌లు తీసుకోని, నిర్మాణాలు చేయరు. ఈ బిల్డింగ్‌ను సాకుగా చూపిస్తూ మున్సిపల్ అధికారులను ప్రశ్నించే రోజులు ముందు ముందు చూడవలసి ఉంటుంది. నందిగామ టిబి రోడ్డుపై నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఇప్పటి వరకు మునిపాలిటీ అధికారులు, సిబ్బంది ఎవ్వరు, ఎటువంటి చర్యలు లేవంటే ఇంత పెద్ద కట్టడం వెనక మర్మం ఏమిటో? త్వరలో ఆంధ్రప్రదేశ్ నుండి ఉన్నత అధికారులు వచ్చి విచారణ చేసి వారి ద్వారా చర్యలు తీసుకుంటే, అప్పుడు కేసులు బిల్డింగ్‌పై ఉంటాయో, లేక నందిగామ మునిసిపల్ అధికారులు, సిబ్బందిపై ఉంటాయో వేచి చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

దుర్గగుడి కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దుర్గగుడి మహామండపం ఆరో అంతస్తులోని కళావేదికపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి కొండపైన కళావేదికపై విశాఖపట్నంకు చెందిన కళావధామ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు తాళ్ళపాక సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్ర నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సుమారు 15 మంది కళాకారులు తమ నాట్య ప్రదర్శనలతో అలరించారు. పుష్పాంజలి, కృష్ణ శబ్దం, సరస్వతీ, లలితా హవతి, బొమ్మ బొమ్మ వంటి పాటలకు కళాకారిణులు ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు.



ప్రదర్శనలు చేసిన కళాకారిణులతో గురువు సందీప్ కుమార్



ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

పలుచోట్ల రాజీవ్ గాంధీ వర్ధంతి



ఇబ్రహీంపట్నంలో...

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నియోజక వర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళ వారం మైలవరం బోసు సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాఫ్ట్వేర్ టెలి కమ్యూనికేషన్ తీసుకువచ్చారని నేడు వారందరికీ రాజీవ్ గాంధీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ వన్ అధ్యక్షులు దోసపాటి గిరిధర్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు శీలం రామకష్ణ, డిసిసి కార్యదర్శి మసన్నం సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, టౌన్ ప్రెసిడెంట్ అన్నవరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విసన్నపేట : స్థానిక మండల కేంద్రంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గోళ్ళ వెంకట గురునాథరావు ఆఫీసులో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడ్డల రాంబాబు, గోళ్ళ వెంకట గురునాథరావు, పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు కడియాల నాగేశ్వరరావు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పలపాటి లక్ష్మీ దాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. రాజీవ్ గాంధీ చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఈ దేశానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని పరిచయం చేసిన మహానుభావుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ అక్కల నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో...



తిరువూరులో...



విసన్నపేటలో...